విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

చిత్తూరు జిల్లా

బుధవారం 16 ఏప్రిల్ 2025 8 పేజీలు

జిల్లాకు అసెంబ్లీ పద్దుల కమిటీ రాక

– జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్

విశాలాంధ్ర – తిరుపతి కలెక్టరేట్ : రెండు రోజుల పర్యటన నిమిత్తం ఈ నెల ఏప్రిల్ 16న అసెంబ్లీ పద్దుల కమిటీ జిల్లాకు రానుందని తిరుపతి జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అసెంబ్లీ పద్దుల కమిటీ ఛైర్మన్ జోగేశ్వర రావు తో పాటు 11 మంది సభ్యులతో కూడిన పద్దుల కమిటీ ఏప్రిల్ 15న విజయవాడ నుండి రాత్రి బయలుదేరి 16వ తేది ఉదయం 5.15 గంటలకు తిరుపతి శ్రీ పద్మావతి అతిథి గృహం చేరుకుని అనంతరం 11.00 గంటలకు రోడ్డు మార్గాన బయల్దేరి చిత్తూరు జిల్లా సమీక్ష ముగించుకుని, సాయంత్రం 5.30 గంటలకు రోడ్డు మార్గంలో బయలుదేరి రాత్రి 7.30 గంటలకు తిరుమల చేరుకొని రాత్రి బస చేసి 17వ తేది ఉదయం శ్రీ వారి దర్శనం చేసుకుని, 10.00 గంటలకు తిరుమల నుండి బయలుదేరి తిరుపతి శ్రీ పద్మావతి అతిథి గృహం చేరుకొని 11.30 గంటలకు పద్మావతి అతిథి గృహం నందు టిటిడి ఈఓ, ఇతర అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి సాయంత్రం 5.15 గంటలకు రైలు మార్గం ద్వారా విజయవాడ తిరుగు ప్రయాణం కానున్నారని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

నిర్బందంగా వెట్టి చాకిరి చేయిస్తే

కఠిన చర్యలు

– జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర – చిత్తూరు: జిల్లాలో నిర్బంధ వెట్టిచాకిరీకి బలౌతున్న కూలీలకు విముక్తి కలిగించడానికి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో నిర్బంధ వెట్టిచాకిరీ కూలీ విధానం నిర్మూలన పై జేసి జి. విద్యాధరితో కలసి సంబంధిత అధికారులు రోప్స్ స్వచ్ఛంధ సంస్థ ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ నిర్బంధ వెట్టిచాకిరీ విధానం పౌల్ట్రీ, పరిశ్రమలు, ఇటుకల తయారీ ప్రాంతాలలో చాలా వరకు అమలవుతున్నదని, దీని కారణంగా ఆర్థిక, శ్రమ దోపిడితో ఇబ్బందులకు గురి అవుతున్నారన్నారు. అటువంటి వారిని గుర్తించడానికి ఆర్డిఓ లు డివిజన్ స్థాయిలో తహశీల్దార్లకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. 1976 నిర్బంధ కూలీ విధానం నివారణ చట్టంను పక్కాగా అమలు చేయాలని సూచించారు. కార్మిక శాఖ, డిఆర్డిఏ, డ్వామా, జెడ్పి సిఈఓ, తదితర అధికారులు క్షేత్ర స్థాయి

2లో

చింతపండు కార్మికులను..

ఆదుకునే నాధుడే లేడా!

చింతపండు కొట్టడం వల్ల అనారోగ్య బారిన పడుతున్న కార్మికులు!

ప్రాణాలు కోల్పోతున్న చింతపండు పని వదలని కార్మికులు!

రాష్ట్ర ప్రభుత్వ భరోసాకు ఎదురుచూస్తున్న కార్మికులు

విశాలాంధ్ర – పుంగనూరు : భారతదేశానికి స్వతంత్రం వచ్చి దశాబ్దాలు గడుస్తున్న ప్రభుత్వాలు మారుతున్న పేదలు మాత్రం దినదిన కూలి చేస్తే తప్ప పూట గడవటం లేదని అనేకమంది పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చింత పండుకు ప్రసిద్ధి గాంచిన ఊరుగా భావిస్తే పుంగునూరు మొదటి స్థానంలో ఉంటుంది. ఇక్కడ చుట్టుపక్క గ్రామాల నుండి చింతపండును స్వీకరించడంతోపాటు మహారాష్ట్ర, కర్ణాటక నుండి సైతం చింతకాయలను దిగుమతి చేసుకొని వాటిని పండుగా మార్చి ఎగుమతి చేయడం జరుగుతుంది. ఈ పనులన్నీ చేయడం కోసం పుంగనూరు పట్టణ పరిధిలో వేల సంఖ్యలో దినసరి కూలీలు చింతపండు కార్మికులుగా పనిచేయడం జరుగుతుంది. ఉదయం 5 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు పనిచేస్తున్నా గిట్టుబాటు కూలి లభించడం లేదని చింతపండు కార్మికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ మూడు నెలల పాటు మాత్రమే చింతపండు పనులు ఉంటాయని

2లో

విశాలాంధ్ర-వెదురుకుప్పం: హవ్వ నవ్విపోదురుగాక..అధికారుల నిర్లక్ష్యం ఓ దళిత విద్యార్థి కులాన్ని మార్చేశారు.ఆరు నెలలుగా తహశీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా కనికరించని దుస్థితి.అగ్రకులం అని ధృవీకరణ చెయ్యడం తో విద్యార్థి చదువులకు కూడా అడ్డంకి గా మారిన పరిస్థితి. అసలేం జరిగిందంటే....



సారూ..

కులం మార్చేశారు..?!

- ఆరు నెలలుగా కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు
- తహసీల్దార్ రమేష్ బాబు నిర్వహకం
- ఆలస్యంగా వెలుగులోకి..
- పరిశీలించి చర్యలు తీసుకుంటామన్న ఆర్డీఓ

వెదురుకుప్పం మండలంలోని మాంబేడు ఆదిఆంధ్రవాడ కు చెందిన కే.రమేష్ కుమారుడు పృధ్వి చరణ్ తిరుపతిలో డిగ్రీ చదువుతున్నాడు. ఈక్రమంలో వెదురుకుప్పం తహసీల్దార్ కార్యాలయంలో కుల ధ్రువీకరణ పత్రం కోసం ఎస్సి మాదిగ అని దరఖాస్తు చేసుకున్నారు.కాగా 15-10-2024 వతేదీ అప్పటి తహశీల్దార్ రమేష్ బాబు నిర్లక్ష్యంతో రెడ్డి ఓసిగా

2లో

వైభవంగా ఒంటిమిట్ట కోదండరాముని

పుష్పయాగం

2లో

ఆదుకునే నాథుడు లేడా!

(మొదటి పేజీ తరువాయి) ఆ తరువాత మేమంతా కూటికోసం కోటి తిప్పలన్నట్లు భిక్షాటన చేసే పరిస్థితి ఎదురవుతుందని ఒక పూట తిని ఒక పూట తినకుండా కాలం వెళ్లబుస్తున్నామని ఆవేదనతో బోరుమని విలపిస్తున్నారు. గిట్టుబాటు ధర ఉన్నప్పటికీ వ్యాపారస్తులు మాత్రం మాకు అరకొర కూలి ఇచ్చి రోడ్డున పడేస్తున్నారని వాపోయారు. రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో పేదవారిని ఆదుకుంటామని అక్కున చేర్చుకుని బాగోగులు చూస్తామని భరోసా ఇస్తామని హామీలు చెబుతుంటారు గాని తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత మా గోడు పట్టించుకునే నాధుడే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. చింతపండు లోడింగ్ అన్ లోడింగ్ కార్మికులు సైతం పూట గడవక నడిరోడ్డున భిక్షాటన చేస్తూ అందరి హృదయాలను కలచివేస్తుంది. ఏమంటే మాకు వ్యాపారస్తులు ఇచ్చి కూలీలు సాలక అప్పులు చేసుకుంటూ నరకయాదన అనుభవిస్తున్నామని వారు వాపోయారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసి మాకు సహాయం అందించాలని కోరుతున్నామన్నారు.

కులం మార్చేశారు..?!

(మొదటి పేజీ తరువాయి) కుల ధృవీకరణ పత్రం మంజూరు చేశారని బాధితులు వాపోయారు.. ఈ విషయం ఆలస్యం వెలుగు చూసింది. ఈ నేపథ్యంలో కులం తప్పుగా సర్టిఫికేట్ ఇవ్వడం తో అప్పటి నుంచి సుమారు ఆరు నెలలుగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగు తున్నా అధికారులు పట్టించుకోలేదన్నారు. ఆటో నడుపుకుంటూ కొడుకుని చదివించుకుంటున్నానని, తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. తప్పుగా కులాన్ని మార్చిన నిర్లక్ష్యం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి తండ్రి రమేష్ కోరారు. ఇదే విషయమై ఇటీవల నూతనం గా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ బాబు వివరణ కోరగా ఇంకా కొన్ని క్యాస్ట్ సర్టిఫికెట్లు తప్పిదాలు జరిగినట్లు గుర్తించామని అన్నారు. వాటిని వెంటనే సరిచేస్తున్నాం అన్నారు. చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు మాట్లాడుతూ కులం మార్పు సర్టిఫికెట్లు మంజూరు విషయమై తహసీల్దార్ వివరణ కోరతామన్నారు. లబ్ధిదారులకి న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటామని వివరించారు.

కఠిన చర్యలు

(మొదటి పేజీ తరువాయి) పరిశీలనకు వెళ్లిన తరుణంలో ఆకస్మికంగా తనిఖీ లు నిర్వహించి నిర్బంధ కూలీలని గుర్తించాలన్నారు. నిర్బంధ కూలీలకు పునరావాసం కల్పించిన అనంతరం వారు గతంలో చేసిన పనులకు సంబంధించి బాండెడ్ లేబర్ రిలీఫ్ సర్టిఫికేట్ మంజూరు చేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ఉపాధి కల్పించి వారి అభివృద్ధికి దోహదపడాలని సూచించారు. బాండెడ్ లేబర్ సమస్యలు వారిని గుర్తించే విధానాలు, వారు ఎదుర్కొంటున్న పరిస్థితులు, వారి రక్షణ, సంబంధిత అంశాల పై విపులంగా చర్చించారు. ఈ కార్యక్రమం లో భాగంగా వెట్టిచాకిరీ, మానవ అక్రమ రవాణా ఒక నేరం అంశాలకు సంబంధించి గోడ పత్రికలు, కర పత్రాలను జిల్లా కలెక్టర్ జే సి లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి జెడ్పి సిఈఓ రవికుమార్ నాయుడు, డిఆర్డిఏ పిడి శ్రీదేవి, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ ఓంకార్, డిపిఓ సుధాకర్ రావ్, డి ఎం అండ్ హెచ్ ఓ. సుధారాణి, నెహ్రూ యువజన కేంద్రం కొ ఆర్డినేటర్ ప్రదీప్ కుమార్, డిటిడబ్ల్యుఓ మూర్తి, చిత్తూరు ఆర్ డి ఓ శ్రీనివాసులు, రోప్స్ సంస్థ ఛైర్మన్ ధనశేఖర్, ప్రోగ్రామ్ హెడ్ శాం జెబాదురై, ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

– చెన్నూరు పి.హెచ్.సి డాక్టర్ జ్యోతి.

విశాలాంధ్ర – గూడూరు : క్యాన్సర్ పై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని చెన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ జ్యోతి పేర్కొన్నారు. మంగళవారం గూడూరు మండల పరిధిలోని నెల్లటూరు గ్రామంలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. బిపి , షుగర్ , పరీక్షల తో పాటు మహిళలు ,పురుషులకు నోటి క్యాన్సర్ , రొమ్ము క్యాన్సర్ , గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్ , పాప్ స్మియర్ పరీక్షలను ఉచితంగా చేశారు. ముందస్తు జాగ్రత్తలతో క్యాన్సర్ ను నివారించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నాగరాజు , స్విమ్స్ మెడికల్ సిబ్బంది డాక్టర్ చైతన్య భాను , డాక్టర్ పద్మావతి , స్థానిక నాయకులు నెలబల్లి భాస్కర్ రెడ్డి , సర్పంచ్ రమణమ్మ ,హెల్త్ సూపర్వైజర్లు మస్తానయ్య , ఉమ హెల్త్ అసిస్టెంట్ నాగేశ్వర రెడ్డి , సిబ్బంది , పాల్గొన్నారు.

శ్రీ కోదండరాముని పుష్పయాగం

విశాలాంధ్ర – తిరుపతి: రెండో అయోధ్యగా విరాజిల్లుతున్నఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామివారి ఆలయంలో మంగళవారం సాయంత్రం పుష్పయాగ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగిందిఉదయం 4 గంటలకు సుప్రభాతంతో స్వామివారి మేల్కొలిపి ఆలయ శుద్ధి, ఆరాధన చేపట్టారు. సాయంత్రం 6 గంటలకు పుష్పయాగం వైభవంగా ప్రారంభమైంది. తులసీదళాలు, మల్లెలు, రోజా, చామంతి, గన్నేరు, సంపంగి, మొగలి దళం తదితర పుష్పాలు, పత్రాలతో స్వామి, అమ్మవారికి పుష్పనీరాజనం సమర్పించారు. ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుండి 2.5 టన్నుల పుష్పాలు విరాళంగా అందాయి. ప్రకృతి వైపరీత్యాల నుంచి భక్తులను కాపాడాలని స్వామివారిని ప్రార్థిస్తూ, భూమాతను ప్రసన్నం చేసుకునేందుకు శ్రీవైష్ణవాలయాలలో పుష్పయాగం నిర్వహిస్తారు. అదేవిధంగా బ్రహ్మోత్సవాల్లో గానీ, నిత్యకైంకర్యాల్లో గానీ తెలియక ఏవైనా లోపాలు జరిగి ఉంటే వాటికి ప్రాయశ్చిత్తంగా పుష్పయాగం నిర్వహిస్తారు. ఈ యాగం నిర్వహణ వల్ల సమస్తదోషాలు తొలగిపోతాయని అర్చకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో నటేష్ బాబు, గార్డెన్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్స్పెక్టర్ నవీన్, ఆలయ అర్చకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పండ్లు మగ్గబెట్టుటలో కాల్షియమ్ కార్బైడ్ ను నిరోధించాలి

విశాలాంధ్ర : తిరుపతి కలెక్టరేట్ : జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ అధ్యక్షతన తిరుపతి కలెక్టరేట్ నందు పండ్లు మగ్గబెట్టుటలో కాల్షియమ్ కార్బైడ్ ను నిరోధించడం గురించి జిల్లా స్థాయి కమిటీ సభ్యులతో చర్చించారు. ఇందులో ఫుడ్ సేఫ్టీ, మార్కెటింగ్, మునిసిపల్, మెడికల్ హెల్త్, పంచాయతి, హార్టికల్చర్, ట్రాన్స్పోర్ట్ డిపార్ట్మెంట్ లతో సమావేశం నిర్వహించి దిశ నిర్దేశం చేశారు. ఈ వేసవి కాలంలో మామిడి పండ్ల సీజన్ మొదలవుతున్న కారణంగా మానవులకు హాని కలిగించే కాల్షియమ్ కార్బైడ్ ను ఉపయోగించి మామిడి పండ్లు మగ్గబెట్టే ప్రక్రియ ను నిరోధించడం గురించి అధికారులతో చర్చించి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. మామిడి పండ్లు పండించే రైతులకు అవగాహన కల్పించడం. మామిడి పండ్లు వ్యాపారం చేసే వ్యాపారస్తులకు తగు చర్యలు తీసుకోవడం గురించి తెలుపడం. ఫుడ్ సేఫ్టీ డిపార్ట్మెంట్ వారిని ఈ కాల్షియమ్ కార్బైడ్ వాడకం నిరోధించడానికి విరివిగా, శాంపిల్లు సేకరించి తదుపరి సంబంధిత వ్యాపారస్తులు, రైతులు , అమ్మకందారుల వద్ద తిరిగి, కార్బైడ్ వాడకుండా తగు సూచనలు/ జాగ్రత్తలు తీసుకోవాలని లేనిచో అట్లు పాటించని వారి పై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా పంచాయత్ అధికారి, మునిసిపల్ సిబ్బందిని జిల్లాలో చిన్న చిన్న దుకాణదారులకు కార్బైడ్ వాడకం వల్ల వచ్చే అనర్థాలు తెలియచేయమని అదే విధంగా ట్రాన్స్పోర్ట్ డిపార్ట్మెంట్ వారు మామిడి పండ్ల రవాణా వాహనాలను తనిఖీ చేయాలనీ జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ఈ క్రింది పద్ధతులను ఉపయోగించి మామిడి పండ్లను మగ్గబెట్టడం ద్వారా ఆరోగ్య కరమైన పండ్లు వినియోగించవచ్చు సహజ సిద్ధంగా మామిడిపండ్లు మగ్గబెట్టాలి, అందుకు వరిగడ్డి, కార్బోర్డ్ బాక్స్, పేపర్ బాగ్స్ ఉపయోగించాలి. నాచురల్ గా సహజ హార్మోన్ ఎతిలీన్ గ్యాస్ స్ప్రే చేయడం ద్వారా మామిడి పండ్లను మగ్గబెట్టవచ్చు రిపెనింగ్ ఛాంబర్ల ద్వారా ఎతిలీన్ హార్మోన్ ఉపయోగించి మగ్గబెట్టడం శీతల గిడ్డంగుల్లో కూడా ఎతిలీన్ హార్మోన్ ఉపయోగించి మామిడి పండ్లు మగ్గబెట్టవచ్చు అని తెలిపారు. రయిపెనింగ్ ఛాంబర్లను రైతులు మరియు వ్యాపారస్తులు వినియోగించుకోవచ్చునని తెలిపారు. రైతు ఉత్పత్తి దారులు (ఎఫ్పిఓఎస్) ఇటీవల నిర్మించిన శీతల గిడ్డంగుల్లో కూడా మామిడి పండ్లు మగ్గబెట్టే కార్యక్రమం చేయవచ్చునని తెలిపారు. అదేవిధంగా ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ వారి అనుమతి పొందిన మిథలిన్ సచెట్స్ ను మాత్రమే మామిడిపండ్ల కృత్రిమంగా పండించుటకు అనుమతి కలదని తెలిపినారు. అదేవిధముగా అనుమతి లేని కాల్షియం కార్బైడ్ ఉపయోగించి పండ్లను పండించిన యడల క్రిమినల్ కేసులు ఎదుర్కొనవలసి వస్తుందని వ్యాపారులను హెచ్చరించారు. అదే విధముగా ప్రతీ వ్యాపారస్తుడు ఎఫ్ఎస్ఎస్ఏఐ వారి లైసెన్స్ పొంది వ్యాపారము నిర్వహించు కొనవలసినదిగాను లేని యడల 10 లక్షల రూపాయల వరకు జరిమానా విధించబడునని తెలియ చేసినారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి దశరథ రామిరెడ్డి, డీపీఓ సుశీల దేవి, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వెంకటేశ్వర్ రావు, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి మద్దిలేటి, ఫుడ్ సేఫ్టీ అధికారులు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

నవ వధువు అనుమానస్పద మృతిపై దర్యాప్తు ముమ్మరం

విశాలాంధ్ర –చిత్తూరు: జిల్లా కేంద్రమైన చిత్తూరు నగరంలో ప్రేమించి మతాంతర వివాహం చేసుకున్న నవవధువు కన్నవారి ఇంట్లోనే అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటనపై చిత్తూరు పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఇది పరువుహత్య లేక ఆత్మహత్య అన్నదాన్ని చేదించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. చిత్తూరు నగరం మసీదు మెట్టకు చెందిన యాస్మిన్ భాను ఎంబీఏ చదివింది. పూతలపట్టు మండలానికి చెందిన సాయి తేజ బీటెక్నిక్ చదువుకున్నారు. వీరికి కాలేజీలోనే పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం కాస్త ప్రేమగా మారింది. అయితే వీరి మతాలు వేరే కావడంతో వివాహానికి యాస్మిన్ భాను తల్లిదండ్రులు అంగీకరించలేదు. దీంతో ఈ ఏడాది ఫిబ్రవరిలో నెల్లూరులో వీరు వివాహం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో తమకు ప్రాణహాని ఉందని తిరుపతి ముత్యాల రెడ్డిపల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. దీంతో వారి ఇరువురి కుటుంబ సభ్యులను పోలీసులు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు. తదుపరి పూతలపట్టు లో ఉంటూ వీరి సంసారం సజావుగా సాగింది. ఈ క్రమంలో యాస్మిన్ భాను తండ్రికి ఆరోగ్యం సరిగాలేదని ఫోన్లో సమాచారం ఇచ్చారు. దీంతో సాయి తేజ తన భార్యను చిత్తూరు పాత బస్టాండ్ లో వదిలి వెళ్లారు. అక్కడ నుంచి యాస్మిన్ భాను తన సోదరుడు తో ఇల్లు చేరింది. ఇంట్లో ఉన్న ఆమె తల్లిదండ్రులు తనకు ఇష్టం లేని పెళ్లి చేసుకుందని గొడవపడ్డారు. ఈ తతంగం ముగిసిన గంట వ్యవధిలోనే యాసిన్ భాను ఇంట్లో అనుమానస్పద స్థితిలో మృతి చెందింది. ఈ విషయంగా తన భార్యను తల్లిదండ్రు లే హత్య చేశారని సాయి తేజ పోలీసులు ఫిర్యాదు చేశారు. అయితే ఈ సంఘం జరిగిన కొద్ది గంటలకే యాశ్విన్ భాను తండ్రితో పాటు తన పెదనాన్న కుమారుడు అదృశ్యమయ్యారు. వీరి కోసం పోలీసులు ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. అయితే పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో కేసును చేదించే పనిలో పడ్డారు. ఈ పరువు హత్య లేక ఆత్మహత్య అన్న విషయం త్వరలోనే కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. ఈ కేసును చేదించేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

అంగరంగ వైభవంగా చీరాలమ్మ తల్లి జాతర మహోత్సవాలు

విశాలాంధ్ర– రేణిగుంట: కొలిచిన వారికి కొంగు బంగారమై ఎన్నో శతాబ్దాలుగా బాసిల్లుతున్న రేణిగుంట మండలం కృష్ణాపురం పంచాయతీ పరిధిలోని ఏడు గ్రామాల ఆరాధ్య దైవం చీరాలమ్మ తల్లి జాతర మహోత్సవాలకు అంగరంగ వైభవంగా శ్రీకారం చుట్టారు. మా ఇంటి ఆడపడుచు చీరాలమ్మ దేవత అని బుధవారం, గురువారం జరిగే జాతర మహోత్సవాల్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని కృష్ణాపురం సర్పంచ్ ముద్దు రాయలు కోరారు. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా జాతర మహోత్సవాలు జరగనున్నాయి. జాతరకు ముందుగా గత మూడు రోజులుగా చీరాలమ్మ తల్లికి ప్రతిరూపమైన గెరిగ ఊరేగింపు జరుగుతుంది. బుధవారం రాత్రి చీరాలమ్మ గుట్టమీద అమ్మవారిని ప్రతిష్ఠించనున్నారు. చీరాలమ్మ తిప్పపై కొలువుదీరిన అమ్మవారిని ప్రతి ఒక్కరూ దర్శించుకుని తరించాలని కృష్ణాపురం సర్పంచ్ ముద్దు రాయలు కోరారు.

ఉపాధిహామీ పనిదినాలు, వేతనం పెంపు సిఫార్సు అభినందనీయం

- ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ప్రభాకర్

విశాలాంధ్ర - గూడూరు : ఉపాధి హామీ పథకంలో పని దినాలు వంద రోజుల నుంచి 150 రోజులు పెంచాలని, అదేవిధంగా కూలీ 300 నుండి 400 రూపాయలు పెంచుతూ పార్లమెంటరీ కమిటీ సిఫార్సు చేయడం అభినందనీయం అని ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ప్రభాకర్ పేర్కొన్నారు. మంగళవారం గూడూరు సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసా య కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ప్రభాకర్ మాట్లాడుతూ గ్రామీ ణ ఉపాధి హామీ చట్టం-2005 చట్టం వచ్చిన దగ్గర నుంచి సుదీర్ఘ కాలం పాటు ప్రధానమైన మార్పులు చేయలేదన్నారు. ఈ చట్టం అమలు తీరు పై పార్లమెంటరీ కమిటీ వేశారని, దాని సిఫార్సుల మేరకు వివిధ రాష్ట్రాలలో వేతనాలలో ఉన్న వ్యత్యాసాలను గమనించి కనీస వేతనం రూ.400 ఉండాలని, ప్రతి కుటుంబానికి కనీసం 150 రోజులు పని దినాలు ఉండాలని పార్లమెంటరీ కమిటీ సిఫార్సు చేయడం హర్షణీయమని తెలిపారు. ఈ చట్టంలో ఇచ్చిన దాని ప్రకారం నిరుద్యోగ భృతి, వేతనాలు సకాలంలో ఇవ్వడం లేదని, పరిహారం అమలు చేయడం లేదని, మెటీరియల్ కాంపోనెంట్ కోసం రాష్ట్ర ప్రభుత్వం 25 శాతం హెచ్చించాలని పార్లమెంటరీ కమిటీ అనేక సిఫార్సులను వ్యవసాయ కార్మికుల కోసం చేసిందని పేర్కొన్నారు. కూలీల కోసం చేసిన ఈ ప్రతిపా దనలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఉపాధి హామీలో కూలి రేట్లు పెంచాలని, వ్యవసాయ కూలీలు వలసలు వెళ్లకుండా పని దినాలు పెంచాలని ఎన్నో ఆందోళనలు చేసినప్పటికీ పాలకులు నిర్లక్ష్యం చేస్తూ వస్తున్నారని గుర్తు చేశారు. ఇప్పటికైనా పార్లమెంటరీ కమిటీ సిఫార్సులను వెంటనే అమలు చేసి కూలీలకు న్యాయం చేయాల న్నారు. అన్ని జిల్లాల్లో వలసలు పెరిగినప్పటికీ వాటిని నివారించ డంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోం దని విమర్శిం చారు. రైతుల పొలాల్లో వందరోజుల కంటే ఎక్కువ ఎక్కడా పనులు దొరకడం లేదని, మిగిలిన రోజులు వ్యవసాయ కూలీలు ఎక్కడ పనులు చేయాలని, పనులు దొరకనందునే ఇతర ప్రాంతాలకు వలస వెళుతున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా ఉపాధి హామీ పనికి సంవత్సరానికి నాలుగు లక్షల రూపాయలు పెంచాల న్నారు. ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షించాలని పేర్కొన్నారు. ఈకార్యక్ర మంలో ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం గూడూరు నియోజకవర్గ కార్యదర్శిశ్రీనివాసా మూర్తి , తదితరులు పాల్గొన్నారు.

మల్లెమాలకు చెందిన వ్యక్తిపై ఫోక్సో కేసు నమోదు

విశాలాంధ్ర-వెంకటగిరి: బాలాయపల్లి మండలం మల్లెమాల గ్రామానికి చెందిన పోలయ్య అనే వ్యక్తిపై ఫోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.గోపి తెలి పారు. బాలికను ప్రేమ పేరుతో మాయ మాటలు చెప్పి గర్భవతిని చేశాడని ఫిర్యా దు. ఈ మేరకు విచారణ నిర్వహించి నిందితుడిపై ఫోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.గోపి తెలియజేశారు.

వంటనూనె మంటలను ఆర్పడానికి

అగ్నిమాపక యంత్రాన్ని ఉపయోగించాలి

- అగ్నిమాపక ప్రధాన అధికారి రాజయ్య

విశాలాంధ్ర- సత్యవేదు: వంటనూనె మంటలను ఆర్పడానికి తడి రసాయన అగ్నిమాపక యంత్రాన్ని ఉపయోగించాలని సత్యవేడు అగ్నిమాపక కేంద్ర ప్రధాన అధికారి రాజయ్య తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోనే శ్రీకాళహస్తి బస్టాంట్ ,రిలయన్స్ మార్ట్ ప్రాంతాల వద్ద ఆయిల్ ఫైర్స్, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక ప్రధాన అధికారి రాజయ్య మాట్లాడుతూ నూనె,గ్రీజు వంటి మండే ద్రవాలు మంటలు పట్టడం ఆయిల్ ఫైర్స్ గా పేర్కొనవచ్చునన్నారు. చిన్న గ్రీజు మంట సంభవించినప్పుడు దానిని ఆర్పడానికి పాన్‌ను ఫైర్ బ్లాంకెట్‌తో కప్పాలన్నారు. అయితే ఆయిల్ ఫైర్స్ ప్రభావం వల్ల దద్దుర్లు,అలసట వంటి ఆరోగ్య ప్రభావాలు ఉండొచ్చని ఆయన వివరించారు. దీంతోపాటు వేసవి తీవ్రత దృశ్య ఎండిన గడ్డి దగ్గర వాహనాలు పార్కింగ్ చేయకుండా జాగ్రత్త పడాలి అన్నారు. పొగాకు ఉత్పత్తులను ఊరికి దూరంగా పడేయాలన్నారు. అగ్ని గుర్తించడానికి ఫైర్ అలారంలు ఏర్పాటు చేసుకోవలసి ఉందన్నారు. తదనంతరం ఆయిల్ ఫైర్స్ నివారణపై అగ్నిమాపక సిబ్బంది తడి రసాయన ప్రయోగాన్ని ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది ప్రసాద్,శ్రీనివాసులు,గోవిందరాజులు,సుబ్రహ్మణ్యం, నరేష్,రవికుమార్ పలువురు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వార్షిక ప్రణాళిక సర్వేను త్వరగా పూర్తి చేయాలి

- మహిళా సమైక్య సమావేశంలో వెలుగు ఏపిఎం డాక్టర్ డాంగే యాదవ్

విశాలాంధ్ర- సత్యవేదు: జీవనోపాదులకు సంబంధించి వార్షిక ప్రణాళిక సర్వేను త్వరగా పూర్తి చేయాలని తిరుపతి జిల్లా సత్యవేడు గ్రామీణాభివృద్ధి సంస్థ(వెలుగు) ఏపిఎం డాక్టర్ డాంగే యాదవ్ కోరారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల మహిళా సమైక్య తొలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ డాంగే యాదవ్ మాట్లాడుతూ జీవనోపాదులు పెంచేలా వార్షిక ప్రణాళిక రూపొందించాలన్నారు. అలాగే బ్యాంకులో తీసుకున్న లింకేజీ రుణాలను సక్రమంగా చెల్లించాలన్నారు. దీంతోపాటు సిఐఎఫ్,ఉన్నతి,శ్రీనిధి వంటి రుణాలు గడువుకు లోపు చెల్లించాల్సి ఉందన్నారు. మహిళా రైతు గ్రూపు ఏర్పాటును వేగవంతం చేయాలన్నారు. అలాగే స్వయం ఉపాధిపై ఆధారపడ్డ వారికి 40 వేల రూపాయలు రుణం మంజూరు చేస్తామన్నారు. అలాగే ఈజీ మార్ట్ కూడా దృష్టి సారించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో వెలుగు కోఆర్డినేటర్లు శివకుమార్,పురుషోత్తం,పుల్లయ్య,మధుసూదన్ రెడ్డి, మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు కోటీశ్వరి, అకౌంటెంట్ కాంచన, పలువురు వివో సంఘం లీడర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర - చౌడేపల్లి : మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జాలప్ప ఆసుపత్రి (దేవరాజ్ అర్స్ కోలార్ మెడికల్ కాలేజీ) వారిచే 60 సంవత్సరాలు పైబడిన వయో వృద్ధులకు ఉచితంగా కంటి పరీక్షలు, మందులు,అద్దాలు రవాణా, భోజనం, వసతి ఏర్పాట్లు చేశారు. 60 సంవత్సరాలకు కంటికి పొర రావడం సహజం కాబట్టి వృద్ధులు అందరు కంటి పరీక్ష తప్పనిసరిగా చేసుకోవాలని ఇలాంటి కార్యక్రమాలు మండల ప్రజలు సద్వినియోగ పరచుకోవాలని సూచించారు. మొత్తం పరీక్షించిన పేషెంట్లు 10 మందిఆపరేషన్‌కు సెలెక్ట్ అయినవారు ముగ్గురుమధుమేహం, రక్త పోటు నియంత్రణలోఉన్నవారు ఆపరేషన్‌కు అర్హులుకార్యక్రమంలో పాల్గొన్నారు.

రూ.5 లక్షలతో వాటర్ ప్లాంట్ ప్రారంభం

విశాలాంధ్ర - పెనుమూరు: మండలంలోని గుంటుపల్లి పంచాయతీ కనకాపురం గ్రామంలో రూ.5 లక్షలతో మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభించినట్లు మహాసముద్రం దయాసాగర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం కనకాపురం గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హేమలత సురేష్ రెడ్డి ఎంపీపీ ప్రతాప్ రెడ్డి తదితర వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ పోలీసులు విస్తృత దాడులు

విశాలాంధ్ర - పుంగనూరు: మండల పరిధిలో ఉన్న పెద్ద తండా పత్రపల్లి తండాల్లో మంగళవారం ఎక్సైజ్ పోలీసులు ఎన్ఫోర్స్మెంట్ పోలీసులు సారా విక్రయదారులపై విస్తృత దాడులు నిర్వహించారు. ఈ దాడులలో పెద్ద తాండాకు చెందిన శంకర్ నాయక్ సతీమణి బి.పద్మను అరెస్ట్ చేసి ఆమె వద్ద నుండి పది లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని సారా తయారీకి ఉపయోగించే బెల్లము అమ్మిన ఇద్దరిపై కేసు నమోదు చేయడం జరిగింది. అలాగే పత్రపల్లి తండాలో సారా అమ్ముతున్న రమణ నాయక కుమారుడు రాము నాయక్ ను అదుపులోకి తీసుకొని ఆయన వద్ద నుండి 30 లీటర్ల సారాం స్వాధీనం చేసుకుని వారికి బెల్లం అమ్మిన వారిపై కేసు నమోదు చేయడం జరిగింది అదేవి ధంగా అదే తండాలోనే లక్ష్మణ్ నాయక్ కుమారుడు తిప్పా నాయక్ వద్ద నుండి స్వాధీనం చేసుకుని అతని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేయడం జరిగింది . ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ సురేష్ రెడ్డి ఎన్ఫోర్స్మెంట్ సీఐ జవహర్‌బాబు, ఎస్సైలు, కానిస్టేబుల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే గ్రీవెన్స్ డే

విశాలాంధ్ర - పుంగనూరు: పట్టణంలోని పోలీస్ స్టేషన్ నందు పలమనేర్ డిఎస్పీ ప్రభాకర్ ప్రజా ఫిర్యాదులను మంగళవారం స్వీకరించారు. పట్టణం , మండల పరిధిలోని అనేకమంది తమ తమ సమస్యల పరిష్కారం కోసం ఆయనకు అర్జీల రూపంలో వినతి పత్రాలు ఇవ్వ డం జరిగింది. ఈ సందర్భంగా డిఎస్పి ప్రభాకర్ మాట్లా డుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కారం కోసమే ప్రతి మంగళ వారం గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నామన్నారు. దీనివలన అనేక సమస్యలు పరిష్కారమై ప్రజలు సుఖసంతోషాలతో జీవిం చడం జరుగుతుందని ఆయన అన్నారు ప్రజలు ఇచ్చిన ప్రతి ఫ్రియాదును పరిష్కరించే విధంగా మేము కృషి చేయడం జరుగుతుందని ఆయన తెలియ జేశారు. ముఖ్య ంగా కక్ష పూరిత ప్రాంతాల్లో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేసి ప్రజల రక్షణ కొరకు కవచంగా మా పోలీసులు పని చేస్తున్నారన్నారు. ఇదేవిధంగా ప్రతి మండల పోలీస్ స్టేషన్‌లో ఎస్సైలు ప్రజా ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరించాలని కోరుతున్నాం అన్నారు.

రైతులకు సబ్సిడీ వ్యవసాయ పరికరాలు పంపిణీ

విశాలాంధ్ర - గూడూరు : గత ఐదు సంవత్సరాలలో రైతులకు ఉపయోగపడే ఒక కార్యక్రమం కూడా వైసిపి ప్రభుత్వం చేయలేదని కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సబ్సిడీతో రైతులకు వ్యవసాయ పరికరాలు అందిస్తున్నామని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే సునీల్ కుమార్ తెలిపారు .గూడూరు పట్టణంలోని వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద రైతులకు ప్రభుత్వం ద్వారా సబ్సిడీపై వ్యవసాయ పరికరాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు .ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సునీల్ కుమార్, సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా హాజరయ్యారు ఎమ్మెల్యే సబ్ కలెక్టర్ ముందుగా స్టాల్స్ ను పరిశీలించారు. రైతులకు వ్యవసాయ పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల్లో వ్యవసాయ శాఖను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని రైతులకు ఏమి చేయలేదని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గూడూరు నియోజకవర్గంలో 103 పరికరాలు అందిస్తున్నా మని రాబోయే రోజుల్లో ఇంకా ఇవ్వడం జరుగుతుందని వెల్లడించారు. అనంతరం సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా మాట్లాడుతూ రైతుల అభివృద్ధి కొరకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని రైతులు ఆర్థికంగా ఎదగాలని సూచించారు. సేంద్రీయ పద్ధతుల ద్వారా వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు నాయకులు పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వరరాజు, శివకుమార్, రహీం ,మట్టం శ్రావణి రెడ్డి ,వెంకటేశ్వర్ రెడ్డి, కిషోర్ నాయుడు, రైతులు తదితరులు పాల్గొన్నారు .

ఘనంగా బొజ్జల గోపాలకృష్ణారెడ్డి జయంతి వేడుకలు

విశాలాంధ్ర - రేణిగుంట: మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి 75వ జయంతి సందర్భంగా మంగళ వారం రేణిగుంట సమీపంలోని అక్షయ క్షేత్రంలో పవన్ కుమార్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు కృష్ణ యాదవ్,టిడిపి పట్టణ అధ్యక్షుడు మహ బూబ్ బాషా హాజరై అల్పాహార విందు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా మానసిక వికలాంగుల నడుమ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా కృష్ణ యాదవ్ మాట్లాడుతూ మానసిక వికలాంగుల మధ్య బొజ్జల గోపాల కృష్ణారెడ్డి జయంతి వేడుకలు జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.తండ్రికి తగ్గ తనయు డుగా నియోజకవర్గంలో సుధీర్ అన్న ప్రజా పాలన కొనసాగిస్తున్నారని తెలిపారు.నేడు గోపాల్ అన్న జన్మదినం సందర్భంగా నిరుద్యోగ యువతకు ఉద్యోగమేల నిర్వహిస్తున్నారని అన్నారు.

పూతలపట్టు ఎమ్మెల్యేకు తానా ఆహ్వానం

విశాలాంధ్ర - పూతలపట్టు : పూతలపట్టు నియోజకవర్గం పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళి మోహన్ కు అరుదైన గౌరవం దక్కింది. ఉత్తర అమెరికాలోని అతి పెద్ద భారతీయ అమెరికన్ సంస్థగా గుర్తింపు పొందిన తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (తానా) ప్రతినిధులు ఆయన్ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు జూలై మూడవ తేదీ నుంచి 5వ తేదీ వరకు అమెరికాలోని నోవోమిచిగన్ లో జరిగే సదస్సు కు హాజరుకావాలని వారు కోరారు తానాప్రతినిధుల ఆహ్వానం మేరకు శాసనసభ్యులు మురళీమోహన్ హాజరవుతారని ఆయన తెలిపారు.

బ్యాంకు రెడ్డప్పకు ఘన సన్మానం

విశాలాంధ్ర - చౌడేపల్లి: మండలంలోని సొసైటీ బ్యాంకులు సేవలు అందించిన బ్యాంకు రెడ్డప్పకు ఉత్తమ అవార్డు సన్మానం. ఆరు దశాబ్దాలుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సహకార కేంద్ర బ్యాంక్ ఉద్యో గులు యూనియన్ సహకార బ్యాంకు ఉద్యోగుల ట్రేడ్ ఉద్యమము కొన్ని జ్ఞాపకాలు గుర్తు చేసుకోవటం 60వ డైమండ్ జూబ్లీ సెలబ్రేషన్ విజయవాడ ఫిబ్రవరి లో రెండు రోజులు ఘనంగా జరి గింది. ఈ సమావేశం సంఘ వ్యవస్థాపకులు కామ్రేడ్ సిహెచ్ మాధవరావు సెలబ్రేషన్ ఆహ్వాన కమిటీ చైర్మన్ మాజీ ఎమ్మెల్యే సిపిఐ రాష్ట్ర అధ్యక్షులు రామకృష్ణ మాజీ ఆప్కాబ్ చైర్మన్ టీడీ జనా ర్ధన్ , ఝాన్సీ రాణి ఆంధ్రప్రదేశ్ సహకార కేంద్ర బ్యాంక్ ఉద్యోగ స్తుల యూనియన్ వైస్ చైర్మన్ మరియు ఏఐటియుసి రాష్ట్ర అధ్య క్షులు వెలుగురి రాధాకృష్ణమూర్తి, సంఘ చైర్మన్ తోటరామా రావు, ముఖ్య అతిథులుగా ఏఐబిఇఏ జాతీయ ప్రధాన కార్యదర్శి వెంకటా చలం, సభాధ్యక్షులు మీ రాంబాబు ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాం ఐస్ అసోసియేషన్ కార్యదర్శి సహకార కేంద్ర బ్యాంకు ఉద్యోగస్తుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సభను ఉద్దేశించి ప్రసంగించారు సహకార బ్యాంకు రైతులకు ఎంతో సేవ చేయాలని వడ్డీ తగ్గిం చేందుకు రెండు అంచుల విధానం తేవాలని సిపిఐ రాష్ట్ర అధ్యక్షులు రామకృష్ణ, మాజీ ఆప్ కబ్ చైర్మన్ టీడీ జనార్ధన్‌ని కోరారు వారు రెండు అంచుల విధానం గురించి అతని పాలకవర్గంలో తీసుకున్న నిర్ణయాలు సభలో వివరించి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడుతో చర్చించి తీసుకొస్తామని సభలో హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా 60 సంవత్సరాలు డైమండ్ జూబ్లీ సెలబ్రేషన్ 68 సంవత్సరంలో సంఘానికి సేవ చేసిన మాజీ ఉద్యోగస్తులకు బి.ఎస్. రాంబాబు సంఘ ప్రధాన కార్యదర్శి రవికుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ నారాయణరెడ్డి, తెలంగాణ సహకార బ్యాంకు ఉద్యోగస్తులు యూనియన్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి జనార్ధన్, తోట రామారావు ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ రిటైర్ మేనేజర్ బ్యాంక్ రెడ్డప్ప సంఘ నాయకులు వారు చేసిన సేవలను గుర్తించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా యూనిట్ అధ్యక్ష కార్యదర్శి రఘుబాబు గంగిరెడ్డి సురేష్ గణేష్ 60 మంది సిబ్బందితో సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎంజీఎం హాస్పిటల్స్ సేవలు అభినందనీయం

- ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : ఎంజిఎం హాస్పిటల్స్ సేవలు అభినందనీయం అని ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే, ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రివర్యులు బొజ్జల గోపాల కృష్ణారెడ్డి 76 వ జన్మదిన సందర్బంగా ఎంజిఎం హాస్పిటల్స్ ఆధ్వర్యంలో వైద్య శిబిరంను నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరాన్ని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి పర్యవేక్షించారు. అనంతరం బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ మా నాన్న జన్మదిన సందర్బంగా శ్రీకాళహస్తి తెలుగుదేశం పార్టీ ఆఫీస్ నందు ఎంజిఎం హాస్పిటల్స్ వారు నిర్వహించిన వైద్య శిబిరంలో దాదాపు 200 మంది ప్రజలు, కార్యకర్తలు పాల్గొని వారికి సంబంధించిన ఆరోగ్య సలహాలను ఎంజిఎం డాక్టర్ లను అడిగి తెలుసుకున్నారని చెప్పారు. ఈ వైద్యశిబిరాన్ని నిర్వహించినందులకు ఎంజిఎం హాస్పిటల్స్ డైరెక్టర్ గుడ్లూరు మయూర్‌కి ధన్యవాదములు తెలిపారు. అలాగే బొజ్జల బృందమ్మ మాట్లాడుతూ శ్రీకాళహస్తి లో వైద్య రంగంలో ఎన్నో విధాలుగా సేవలు అందిస్తున్న ఎంజిఎం హాస్పిటల్స్ రాబోయే రోజుల్లో మరికొన్ని వైద్య సేవలు అందిస్తూ ఎన్నో విధాలుగా అభివృద్ధి చెందాలని ఆశాభావం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి కార్యకర్తలు, ప్రజలు, అధికారులు ఎంజిఎం హాస్పిటల్స్ డాక్టర్‌లు, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

యుగయుగాలకు,భావితరాలకు రామనామమే జీవిత పరమార్థం

- ప్రముఖ మానసిక నిపుణులు చంద్రమౌళి

విశాలాంధ్ర -తిరుపతి రూరల్ : రాష్ట్రీయ సేవా సమితి (రాస్) ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.వెంకటరత్నం సూచనల మేరకు తిరుపతి కార్పొరేషన్ పరిధి,స్థానిక కొరమీనగుంట లోని శ్రీరామాలయంలో పొదుపు సంఘాల మహిళలతో సీతారామ కళ్యాణ వేడుకలు నిర్వహించడంతో పాటు అత్యంత భక్తిశ్రద్ధలతో,అంగరంగ వైభవంగా రామనామ స్మరణతో,వేద పండితుల మంత్రాలతో, భక్తి పారవశ్యంతో, ఉపవాస దీక్షతో, ఉత్సవ మూర్తులను,పెళ్లి పీటలపై ఆశీనులను చేసి సుందరంగా మేళ తాళాల నడుమ కళ్యాణం కమనీయంగా,కనుల పండగగా 300 మంది మహిళలతో చేశారు.ముఖ్య అతిథిగా విచ్చేసిన చంద్రమౌళి మాట్లాడుతూ యుగయుగాలకు, భావితరాలకు రామనామమే జీవిత పరమార్థం అని తెలిపారు.సనాతన ధర్మాన్ని ఆచరణలో పెట్టి మంచి పరిపాలన విధానాన్ని సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చిన మార్గదర్శకులు శ్రీరాముడని కొనియాడారు. ధర్మం,శాంతి,ఓర్పు,వినమ్రం గా ఉండడం,వంటి మార్గాలను అనుకరించడం ద్వారా అనుకున్న లక్ష్యాలను సాధించి ప్రపంచానికి మార్గదర్శకులు శ్రీరాముని జీవితమును ప్రశంసించారు. రాస్ సంస్థ ఇటువంటి సామూహిక కార్యక్రమాలు చేయడం ద్వారా మహిళలలో ఐకమత్యం, అవగాహన కల్పించడం అద్భుతమైనదాని ప్రశంసించారు. రాస్ పథక సంచాలకులు వి. నాగరాజు మాట్లాడుతూ పొదుపు అప్పులే కాకుండా వారిలో ఆర్థికంగా చైతన్య వంతులుగా చేయడం, చేతివృత్తుల ద్వారా ఉచితంగా శిక్షణ అందించడం,కుటుంబ పోషణకు ఆదాయ మార్గాలను చూపించడం జరుగుతుందని తెలిపారు.పిల్లలను బాగా చదివించి వారిలో నైతిక విలువలతో కూడిన సాంస్కృతి సాంప్రదాయాల నేర్పించి నేటికీ ఆదర్శప్రాయంగా ఉండే సీతారాముల్లాగా తీర్చిది ద్దాలని పిలుపునిచ్చారు. అనంతరం నిరుపేదలను గుర్తించి వారికి దుప్పట్లు,చేతి కర్రలు,వాకర్స్ అందించారు.చిన్నపిల్లలు వేసిన భరతనాట్యం చూపురులను విశేషం గా ఆకట్టుకుంది.ఈ కార్యక్రమంలో సిబ్బంది వాణి, కవిత,మంజుల, సత్యనారా యణ,నాగమణి, తోపాటు,దేశమ్మ,మౌనిక, రాజేశ్వరి,రమాదేవి,తదితర మహిళలు పాల్గొన్నారు.

ఒలంపియాడ్ పరీక్షలో శ్రీ చైతన్య ప్రభంజనం

విశాలాంధ్ర - చంద్రగిరి: స్థానిక చంద్రగిరిలో ఉన్న శ్రీచైతన్య పాఠశాల విద్యార్థి ఒలంపియాడ్ పరీక్షల్లో సత్తాచాటాడు. ఒలంపియాడ్ పరీక్షల్లో భాగంగా నిర్వహించే ఐఎన్‌టిఎస్ఓ పరిక్షలో ప్రథమబహుమతిని సాధించి తిరుపతి జిల్లా విద్యాధికారి కె.వి.ఎన్ కుమార్ చేతుల మీదుగా టాబ్, మెడల్, సర్టిఫికెట్ అందుకున్నాడు. ఎంజిఎం సురేష్ బహుమతి సాధించిన విద్యార్థికి అభినందనలు తెలియజేశారు. ఈ కా కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జమీల్ బాషా, దీన్ పురుషోత్తమ్ ఉపాధ్యాయబృందం పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన

ఏర్పాట్లను స్వయంగా పరిశీలించిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

2000మంది యువత హాజరు - వెయ్యిమంది ఎంపిక - నియామకపత్రాలు అందజేసిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలో మంగళవారం మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి జయంతిని పురస్కరించుకుని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో మెగా జాబ్‌మేళాను నిర్వహిం చారు. ఈ మేళాను కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ఆవిష్కరించారు. ఈ మేళాకు సుమా రు 2వేలమంది నిరుద్యోగులు హాజరు కాగా అందులో వెయ్యిమంది ఎంపిక అయ్యారు. వారికి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజుతో కలిసి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి నియామక పత్రాలను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ తన తండ్రి బొజ్జల గోపాలకృ ష్ణారెడ్డి జయంతి సందర్భంగా స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా విజయవంతం కావడం ఎంతో సంతో షంగా ఉందన్నారు. ప్రతి ఈత తన తండ్రి నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత మాజీ మంత్రివర్యులు కీర్తిశేషులు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి జన్మదినం సందర్భంగా మెగా జాబ్ మేళా నిర్వహిస్తానని ఇంత మంది నిరుద్యోగులు ఇంటర్వ్యూలకు హాజరు కావడం శుభపరిణా మమన్నారు. వెయ్యిమందికి తన చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేయడం ఆనందంగా ఉందని చెప్పారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఇన్ని పరిశ్రమలు ఉన్నాయంటే తన తండ్రి, మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి చలవేనని చెప్పారు. తన తండ్రి జయంతి నాడు ప్రతి సంవత్సరం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తానని చెప్పారు. జాబ్ మేళకు హాజరైన నిరుద్యోగ యువతీ యువకులకు అన్ని ఏర్పాట్లతో పాటు భోజన సదుపాయం కల్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, ఎమ్మెల్యే మాతృమూర్తి బొజ్జల బృందమ్మ, ఎమ్మెల్యే సతీమణి బొజ్జల రిషితా రెడ్డి,టీడీపీ నాయకులు, రంగినేని చెంచయ్య నాయుడు, రావిళ్ళ మునిరాజు నాయుడు, విజయ్ కుమార్ నాయుడు, కన్నులు, ప్రతాప్ రెడ్డి, తాడిపత్రి రవీంద్రనాథ్ రెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తులకు

17 వరకు గడువు పొడిగింపు

విశాలాంధ్ర - తిరుపతి : ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రవేశాల కోసం నిర్వహించే పాలిసెట్ - 2025 దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది అని,ఇందుకు సంబంధించిన గడువు ఏప్రిల్ 17వ తేదీతో పూర్తవుతోంది అని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు,విశ్వం పోటి పరీక్షల సమాచార కేంద్రం అధినేత డాక్టర్ ఎన్ . విశ్వ నాథ్ రెడ్డి పేర్కొన్నారు.ఏప్రిల్ 30వ తేదీన పాలిసెట్ 2025 ఎంట్రెన్స్ పరీక్షను నిర్వహిస్తారు. ప్రవేశ పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది అని మొత్తం 120 ప్రశ్నలు ఉంటాయి. మ్యాథమెటిక్స్ నుంచి 50 ప్రశ్నలు, ఫిజిక్స్ నుంచి 40 ప్రశ్నలు అడుగుతారు. ఇక కెమిస్ట్రీ నుంచి 30 ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష సమయం 2 గంటలుగా ఉంటుంది.మరిన్ని వివరాలకు 8688888802/03, 9399976999 నెంబరులకు సంప్రదించ వచ్చునని తెలిపారు.

అనుమతి లేని నారాయణ స్కూల్ సీజ్

విశాలాంధ్ర -తిరుపతి రూరల్ : తిరుపతి నగరంలోని న్యూ బాలాజీ కాలనీలో ఉన్న అనుమతి లేని నారాయణ పాఠశాలను సీజ్ చేయాలని ఎన్ఎస్యూఐ, జీఎన్ఎస్, ఎన్ఎల్ఎస్ఏ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. అనుమతులు లేకుండా కమర్షియల్ భవనంలో గత ఆరు నెలల నుండి నారాయణ పాఠశాల నడిపిస్తున్నారు.సంబంధిత పాఠశాలకు అనుమతులు లేవని తెలిసింది తక్షణమే డీఈఓకి తెలియజేయగా వారు డిప్యూటీ డిఈఓ బాలాజీ ని పంపించారు.రికార్డులన్నీ పరిశీలించగా ఆ స్కూలుకు సంబంధిత పత్రాలు ఏమీ లేని తెలిసిన వెంటనే డిప్యూటీ బాలాజీ విద్యార్థి సంఘాల నేతలు ఎన్. ఎస్. యు.ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెన్నే మల్లికార్జున, జి.ఎన్.ఎస్ రాష్ట్ర అధ్యక్షులు శివశంకర్ నాయక్,ఎన్ ఎన్ ఎల్ ఎస్ ఏ రాష్ట్ర అధ్యక్షులు సుందర రాజు సమక్షంలో నారాయణ పాఠశాలను సీజ్ చేశారు.ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నేతలు మాట్లాడుతూ టెక్నో ,ఈ టెక్నో ,ఒలింపియాడ్ ఐఐటి ఫౌండేషన్ అనే రకాల పేర్లతో విద్యార్థుల తల్లిదండ్రుల నుండి లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారని, నారాయణ సంస్థలో సొంతంగా పుస్తకాలను ప్రింట్ చేసి వేలాది రూపాయలకు అమ్ముతున్నారని, ప్రభుత్వం పెట్టిన నియమ నిబంధనలు పాటించకపోవడం, నాణ్యమైన విద్యని విద్యార్థులకు అందించకపోవడం సరైన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయకపోవడం కమర్షియల్ బిల్డింగ్ లో పాఠశాల నిర్వహించడం చాలా దారుణం అన్నారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని నారాయణ పాఠశాలను సీజ్ చేసినందుకు డీఈఓ,డిప్యూటీ డీఈవోలకు ధన్యవాదాలు తెలియజేశారు.నారాయణ విద్యాసంస్థల దోపిడీపై భవిష్యత్తులో మరిన్ని ఉద్యమాలకు శ్రీకారం చుడతమని హెచ్చరికలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షులు బాలాజీ, జి ఎన్ ఎస్ నాయకులు చంద్రనాయక్, కుమార్, బాలు, తదితరులు పాల్గొన్నారు.

తిరుచానూరు పోలీసుల చాకచక్యం

తప్పిపోయిన పిల్లలను పట్టుకున్న వైనం

విశాలాంధ్ర - తిరుపతి కలెక్టరేట్ : తిరుపతి రూరల్ తిరుచానూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని మంగళంకు చెందిన 5 మంది పిల్లలను 12 నుంచి 15 సంవత్సరాల పిల్లలు కలిసి పాండిచ్చేరి చూడాలని ఆశతో వెళ్లారు. పోలీసుల కథనం మేరకు సోమవారం మంగళంకు చెందిన 5 మంది పిల్లలు కలిసి పాండిచ్చేరి చూడాలని ఆశతో కలిసి మాట్లాడుకుని ఇంటిలో ఉన్న 3 వేలు రూపాయలు తీసుకొని పాండిచ్చేరి చూడాలని కోరికతో మధ్యాహ్నం 12 సమయంలో ట్రైన్లో వెళ్ళిపోయారు, పాండిచ్చేరి చేరుకోగానే అర్ధరాత్రి సమయంలో భయం వేసి నైట్ టైం పడుకోవడానికి దగ్గర్లో ఉన్న లాడ్జికి వెళ్లారు. లాడ్జి సిబ్బందికి అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్కడి పోలీసు వారు పూర్తి సమాచారం సేకరించి వారి సమాచారం అందించగా తిరుచానూరు పోలీసులు వెంటనే స్పందించి తల్లిదండ్రులను విచారణ చేపట్టి అక్కడ పోలీసులతో మాట్లాడి పిల్లలను తిరుపతి తీసుకురావ డానికి కృషి చేశారు. అందులో భాగంగా తిరుచానూరు సిఐ సునీల్ కుమార్ ఆదేశాల మేరకు, ఎస్సైలు జగన్నాథం, సాయికుమార్ చౌదరి పోలీస్ సిబ్బంది కలిసి పిల్లలను పాండిచ్చేరి నుంచి తీసుకురా వడానికి ఎంతో కృషి చేశారు.

పన్ను రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి

- కమిషనర్ చిన్నయ్య

విశాలాంధ్ర- సూళ్లూరుపేట : 2024-25 ఆర్థిక సంవత్సరంనకు సంబందించిన ఇంటి పన్నులు మరియు ఖాళీ స్థలం పన్నులు ఏక మొత్తంగా చెల్లింపు బకాయిలు పై రాష్ట్ర ప్రభుత్వము వారు వడ్డీ పై 50% రాయితీ కల్పించుచూ జి.ఓ.యం.యస్ నెం :65 తేది: 10.04.2025నాటి ఉత్తర్వులు ద్వారా మినహాయింపు ఇచ్చి ఉన్నందున పట్టణ ప్రజలు తేది: 30.04.2025 లోపు ఈ సదవకాశమును వినయోగించుకొనవలెనని తెలియజేయడమైనది అని మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య తెలిపారు. 2025-26 ప్రస్తుత ఆర్థిక సంవత్సరంనకు ఇంటి పన్నులు మరియు ఖాళీ స్థలం పన్నులను సంవత్సర మొత్తముగా ముందస్తు చెల్లింపు పై 5% శాతము రాయితీ తేది: 30.04.2025 వరకు అవకాశము కల్పించి ఉన్నారు. కావున పట్టణములోని పాత బకాయి దారులు మరియు ప్రస్తుత ముందస్తు చెల్లింపు దారులు ఈ సదవకాశమును వినయోగించుకొని ఇంటి పన్నులు మరియు ఖాళీ స్థలం పన్నులను పురపాలకసంఘ కార్యాలయము నందు గాని అన్ని సచివాలయము నందు గాని చెల్లించి తగు రసీదు పొందవలసినదిగా కోరడమైనది. శలవు దినములలో కూడా పన్నులు కట్టించుకోనుటకు పురపాలక సంఘ నందు కౌంటరు ఏర్పాటు చేయడమైనది. పన్నులు చెల్లించుటకు ప్రతి రోజు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు కౌంటర్ అందుబాటులో ఉండును.

అగ్ని ప్రమాదాల పట్ల అవగాహన

విశాలాంధ్ర-కోట : అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక శాఖ అధికారి హరీష్ పేర్కొన్నారు. కోటలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద మంగళవారం అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా తమ సిబ్బందితో కలిసి అగ్ని ప్రమాదాల సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు.ఈసందర్భంగా గ్యాస్ సిలిండర్ లీకై మంటలు వ్యాపిస్తే ఏవిధంగా మంటలను ఆర్పివేయాలో ప్రయోగాత్మకంగా వివరించారు.అనంతరం ఆర్టీసీ డిపోమేనేజర్ చేతులమీదుగా కరపత్రాలు పంపిణి చేశారు.ఈ కార్యక్రమంలో సిబ్బంది ఎస్.డి.ఎం.డి సిద్ధిక్,సిహెచ్.శ్రీనివాసులు,బి. వెంకటసుబ్బయ్య,వీ .నాగేంద్ర, సిహెచ్.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

కల్మషం లేని దాన కర్ణుడు సేవా ప్రస్థానం

పార్టీ బలోపేతానికి అభివృద్ధికి నిరంతరాయంగా కృషి చేస్తున్న వీరోచితుడు సుబ్రహ్మణ్యం నాయుడు

విశాలాంధ్ర - గుడిపాల : గత వైసిపి ప్రభుత్వంలో పార్టీ అధికారంలో లేకపోయినప్పటికీ మండలంలో పార్టీ ఉనికిని నిలబెట్టిన నాయకుడు. అటు పార్టీ పరంగానే కాకుండా కరోనా సమయంలో సొంత నిధులతో మండల ప్రజలకు నిత్యవసర సరుకులు పంపిణీ మరెన్నో సేవా కార్యక్రమాలు ఆయన సొంతం. తెలుగుదేశం పార్టీ బలోపేతానికి పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న వీరోచిత నాయకుడు ప్రస్తుత గుడిపాల మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు అని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు వివరాల్లోకెళితే గత వైసిపి ప్రభుత్వం లో నుండి మండలంలో తెలుగుదేశం పార్టీ ఉనికిని చాటడం కోసం పార్టీ క్యాడర్ చీలకుండా నాయకులను కార్యకర్తలను ఎప్పటికప్పు డు ఏకతాటిపై నడిపించి 2024 లో పార్టీని అధికారంలోకి తీసుకు రావడానికి మండల వ్యాప్తంగా గట్టి కృషి చేసిన వ్యక్తి సుబ్రహ్మ ణ్యం నాయుడు వృత్తి వ్యాపా రాలు బెంగ ళూరు నందు ఉన్నప్పటికీ నిత్యం అలుపె రగని నాయకుడిలా మం డలంలో ప్రజలు నాయకుల మధ్య ఉంటూ పార్టీ పటిష్టతకు కృషి చేస్తున్న వ్యక్తి అతడు కరోనా మహమ్మారి విలయతాండవం చేస్తున్న సమయంలో పార్టీ పేరుతో పార్టీ అభివృద్ధి కోసం తన సొంత నిధులతో ప్రజలకు కూరగాయల పంపిణీ నిత్యవసర సరుకుల పంపిణీ మెడికల్ క్యాంపులు ఏర్పాటు పేద ప్రజలకు ఆహారం పంపిణీ అదేవిధంగా పార్టీ అధికారంలో లేకపోయినప్పటికీ కార్యకర్తలకు నాయకులకు భరోసాను ఇస్తూ మృతి చెందిన కార్యకర్తలకు సొంత నిధులతో తన వంతు ఆర్థిక సహాయాన్ని అందిస్తూ ప్రజలు నాయకులు కార్యకర్తలు గుండెలలో తెలుగుదేశం జెండాను లోతుగా వ్యాప్తి చెందించిన వ్యక్తి అనే విషయంలో ఎలాంటి అతిశయోక్తి లేదు, గుడిపాల మండలంలో మొట్టమొదటిసారిగా పార్టీ పేరు మీదుగా అన్న క్యాంటీన్ ప్రారంభించి పేద ప్రజల ఆకలి తీర్చిన వ్యక్తి అతడు పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీ ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తూ సభలు కార్యక్రమాలు నిర్వహిస్తూ అప్పటి అధికార పక్షం వైసిపి ప్రభుత్వాన్ని దీటుగా ఎదుర్కొన్న వ్యక్తి అని చెప్పవచ్చు అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఇప్పటికీ నాయకులను కార్యకర్తలను కలుపుకొని వెళ్తూ కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇస్తూ ముందుకు సాగుతున్న అధినాయకుడు సుబ్రహ్మణ్యం నాయుడు, ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు సేవా కార్యక్రమాలు సొంత నిధులతో పార్టీని అభివృద్ధి చేసినప్పటికీ పార్టీ హై కమాండ్ నుండి ఇంతవరకు ఎలాంటి ఉన్నత పదవులు గాని ఆశించని మకుటం లేని మహారాజుగా ఆయనను పలువురు నాయకులు ప్రజలు అభివర్ణిస్తున్నారు.

పోలీస్ స్టేషన్‌లో వైసీపీ నాయకుల పిర్యాదు

విశాలాంధ్ర- నాయుడుపేట: తిరుపతి జిల్లా నాయుడుపేట పోలీస్ స్టేషన్లో వైసీపీ నాయకులు ఐటిడిపి ద్వారా వచ్చే పోస్టులపై నాయుడుపేట సీఐ బాబికి ఫిర్యాదు చేశారు.శ్రీరెడ్డి అభిమాని అనే పేరుతో ఒక ఫేక్‌ని సృష్టించి అందులో మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షులు జగన్ మోహన్ రెడ్డి , మాజీ మంత్రి రోజా, విడుదల రజనీ ఫోటోస్ ను మార్ఫింగ్ చేసి చాలా జుగుప్సాకరంగా సోషల్ మీడియాలో షేర్ చేయడం జరిగింది. కావున సూళ్లూరుపేట మాజీ శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య ఆదేశాల మేరకు నాయుడుపేట టౌన్ అధ్యక్షుడు కలికి మాధవ రెడ్డి, సూళ్లూరుపేట నియోజకవర్గ సోషల్ మీడియా ఇంచార్జ్ నాగిరెడ్డి లక్ష్మీ ప్రసన్న కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఆ అకౌంట్ పేరు ఉన్న వారిమీద చర్యలు తీసుకోవాలని నాయుడుపేట పిర్యాదు చేశారు. నాయుడుపేట రూరల్ వైసీపీ పార్టీ అధ్యక్షులు ఒట్టూరు కిషోర్ యాదవ్ , ఓజీలి మండల వైసీపీ పార్టీ అధ్యక్షులు పాదర్తి హరినాథ్ రెడ్డి , మాజీ రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ పాలూరు.దశరథరామ్ రెడ్డి, నాయుడుపేట వైసీపీ నాయకులు పేట చంద్రా రెడ్డి, కటకం జయరామయ్య, సూళ్లూరుపేట నియోజకవర్గ యువత అధ్యక్షులు పాలేటి నాగార్జున, సూళ్లూరు పేట నియోజకవర్గ వైసీపీ మహిళా అధ్యక్షులు రత్నశ్రీ,మున్సిపల్ కౌన్సిలర్ అశోక్ కుమార్,నెల్లూరు జిల్లా క్రిస్టియన్ మైనారిటీ అధ్యక్షుడు భావన్, నియోజకవర్గ ముస్లిం మైనారిటీ అధ్యక్షులు షేక్ షబ్బీర్, నాయుడుపేట రూరల్ వైసీపీ పార్టీ యువత అధ్యక్షులు ఏ. అనిల్ కుమార్ రెడ్డి, వైసీపీ నాయకులు ముత్యాల రెడ్డి, భాస్కర్ రెడ్డి,రాహుల్,సోషల్ మీడియా యాక్టివిస్ట్ హారతి రెడ్డి,బద్రీ సురేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సన్మానం

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి: పట్టణంలోని ఎంజీఎం కళాశాలకు చెందిన ఇంటర్ విద్యార్థులు ప్రతిభ చూపడంతో వారిని మంగళశారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఘనంగా సన్మానించి అభినందించారు. ఎంపీసీ విభాగంలో భావన అనే విద్యార్థిని రాష్ట్రస్థాయిలో రెండవ ర్యాంకు, బైపీసీ విభాగంలో హాసిని ప్రియ 4వ ర్యాంకు, సీఈసీ విభాగంలో కిషోర్ మొదటి ర్యాంకు సాధించారు. ఆయన మాట్లాడుతూ ఎంజీఎం కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించడం సంతోషకరమన్నారు. మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వీఎస్ రత్నం, ఏవో మహదేవన్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ బంగారమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు

విశాలాంధ్ర - కార్వేటి నగరం : కార్వేటినగరం గ్రామ దేవత అయిన శ్రీ బంగారమ్మ ఆలయంలో మంగళవారం ఉదయం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పుష్పాలతో అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుండి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. కొందరు భక్తులు అమ్మవారికి పొంగళ్ళు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు కే ప్రసాద్, ఉపాధ్యక్షులు రంగనాథ మొదలియార్, కార్యదర్శి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

లింగాపురం గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎంపీడీవో

విశాలాంధ్ర- పెద్దపంజాణి : మండలం లోని లింగా పురం సచివాలయాన్ని ఎంపీ డీవో బాలాజీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో రిజిస్టర్లు పరిశీలించారు. జీరో టు సిక్స్ ఇయర్స్ పిల్లలకు సంబంధించి అందరికీ ఆధార్ కార్డులు తప్పనిసరి అని జనన ధ్రువీకరణ పత్రాలను తప్పనిసరిగా మంజూరు చేయించాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. జనన ధ్రువీకరణ పత్రాలు పొందిన అనంతరం ఆధార్ కార్డుల కోసం దరఖాస్తు చేయించాలని చెప్పారు.మండలంలో 85 మంది పిల్లలకు ఇంకా జనన ధ్రువీకరణ పత్రాలు అందాల్సి ఉందని తెలిపారు.అంగన్వాడీ టీచర్లు సచివాలయ సిబ్బంది పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేసి చిన్నపిల్లలకు జనన ధృవీకరణ పత్రాలు ఆధార్ కార్డులు వంద శాతం కాలయాపన లేకుండా పంపిణీ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.

ఘనంగా మాజీ మంత్రి కీ.శే. బొజ్జల గోపాలకృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి: స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి కీర్తిశేషులు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. బొజ్జల గోపాల కృష్ణారెడ్డి జయంతి సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జయంతి వేడుకలలో శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, మాతృమూర్తి బొజ్జల బృందమ్మ, ఎమ్మెల్యే సతీమణి బొజ్జల రిషిత రెడ్డి, పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొజ్జల గోపాల కృష్ణారెడ్డి చిత్రపటానికి నివాళులర్పించి అనంతరం కేక్ కట్ చేసి గోపాల కృష్ణారెడ్డితో నడిచిన అభిమానులకు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కేక్ తినిపించారు. బొజ్జల గోపాల కృష్ణారెడ్డిని స్మరించుకుని వారు చేసిన అభివృద్ధి సంక్షేమాన్ని టీడీపీ కుటుంబ సభ్యులు గుర్తు చేసుకున్నారు. అనంతరం ఉచిత ఐ క్యాంపును ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ క్యాంపులో పలువురు ఐ చెకప్ చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - పాకాల : అగ్ని ప్రమాదాల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని పాకాల అగ్నిమాపక శాఖ అధికారి గుణశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా మంగళవారం పాకాల పట్టణంలోని పార్క్ వీధిలో అగ్ని ప్రమాదాలపై డెమో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్యాస్ సిలిండర్ లో గ్యాస్ లీకేజీ వలన మంటలు చెలరేగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్యాస్ లీక్ అవుతున్నట్లు అనుమానం వచ్చిన వెంటనే రెగ్యులేటర్ ను ఆపివేయాలని తెలిపారు. అగ్నిప్రమాదం జరిగిన వెంటనే 101 కు వెంటనే సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్ని మాపక సిబ్బంది బాలాజీ ,నాగార్జున ,సురేంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయాలకు అంకితం కావాలి

విశాలాంధ్ర-చిల్లకూరు: భారతరత్న డాక్టర్ భీమ్ రావ్ రాంజీ అంబేడ్కర్ అశయాలను సాధించేందుకు ప్రతి ఒక్కరూ అంకితం కావాలని గూడూరు నియోజకవర్గ తెలుగుదేశం మహిళా కార్యదర్శి దాసరి శైలజ యువతకు ఓడూరు గ్రామంలో పిలుపునిచ్చారు. అంబేద్కర్ సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోతారని, అయన జీవితం ఆదర్శనీయమన్నారు. నిరుపేద కుటుంబ నేపథ్యంలో ఒడిదుడుకులను ఎదుర్కొని ఉన్నత విద్యావంతులు అయ్యారని, భారత రాజ్యాంగ నిర్మాతగా భారతదేశ ప్రజలకు సుపరిచితుడని ప్రకటించారు. యువత బాగా చదువుకొని ముందుకు పోవలని సూచించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘననివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో మాలేశ్వరయ్య , శేఖర్ , సునీల్, చెంగయ్య , విజయ్ , బోజేంద్ర , రామ్మోహన్ మరియు తెలుగు యువత వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

తిరుమల ఆలయ పరిసర ప్రాంతంలో డ్రోన్ కలకలం

విశాలాంధ్ర -తిరుమల కల్చరల్ : డ్రోన్ ఎగురవేసిన యూట్యూబర్ ను అదుపులోకి తీసుకున్న విజిలెన్స్ రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన అన్షుమన్ తరెజా అను ఓ యూట్యూబర్ మంగళవారం సాయంత్రం శ్రీవారి ఆలయం ఎదురుగా ఉన్న హరినామ సంకీర్తన మండపం వద్ద డ్రోన్ ఎగురవేసినట్లు టీటీడీ విజిలెన్స్ సిబ్బంది గుర్తించారు వెంటనే అతనిని అదుపులోకి తీసుకుని డ్రోన్ స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

విశాలాంధ్ర -శ్రీకాళహస్తి: పట్టణంలోని ఎస్వీమార్టు, రైల్వేస్టేషన్ పరిసరాల్లో అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్నిప్రమాదాలు సంభవించినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలను వివరించారు. అనంతరం ప్రయాణికులకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి అగ్నిమాపక అధికారి నాగార్జునరెడ్డి, సిబ్బంది, సునీల్‌కుమార్, అమర్‌నాథ్, రాజా, మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

విశాలాంధ్ర- నాయుడుపేట: అగ్ని మాపక వారోత్సవాల సందర్భంగా తిరుపతి జిల్లా,నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్ లో అగ్ని మాపక అధికారి డివి. రమణయ్య ఆధ్వర్యంలో ప్రజలకు గ్యాస్ వెలిగించి ఏ విధంగా మంటను ఆర్పాలన్నా విషయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారి మాట్లాడుతూ 1944 ఏప్రిల్ 14వ తేదీన కార్గో ఫైర్ యాక్సిడెంట్ లో 66 మంది చనిపోయారు. అన్నారు వారు జ్ఞాపకార్థంగా ప్రతి ఏటా14 నుంచి 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలు జరుపుతున్నామని పేర్కొన్నారు.

విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలి

విశాలాంధ్ర - కార్వేటి నగరం : నేటి పోటీ ప్రపంచంలో ఉద్యోగ సాధన దృష్ట్యా సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ విజయ్లు రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కళాశాలలో జై కేసి ఆధ్వర్యంలో కుప్పంకు చెందిన వన్ ఎం వన్ బి గ్రీన్ స్కిల్స్ కెరీర్ రెడీనెస్ సెంటర్ వారు జిల్లా కలెక్టర్, కళాశాల విద్య ప్రాంతీయ సంచాలకులు, కడప ఆదేశాల మేరకు కళాశాలలోని విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు సాంకేతికత నైపుణ్యాలపై అవగాహన కార్య క్రమాని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగ నియామక అధికారులు శృతి, ప్రకాష్ విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. సాంకేతిక నైపుణ్యాలు, రెజ్యూమ్, ఇంటర్వ్యూ, స్టిల్స్ సెల్ఫీ ఇంట్రడక్షన్ పై ప్రాక్టికల్ మరియు వ్యక్తిగత సామర్థ్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల జే కే సి కోఆర్డినేటర్ సి.ఎన్ లత, టిలోకేశ్వర్, ధనంజయ రెడ్డి,, రఘురాం పాల్గొన్నారు.

మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డికి
కుటుంబ సభ్యులు ఘన నివాళి

విశాలాంధ్ర – శ్రీకాళహస్తి : మాజీ మంత్రివర్యులు స్వర్గీయ బొజ్జల గోపాలకృష్ణారెడ్డి జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి బొజ్జల కుటుంబీకులు ఘన నివాళులర్పించారు. మంగళ వారం బొజ్జల గోపాలకృష్ణారెడ్డి జయంతి సందర్భంగా ఊరందూరు గ్రామంలోని వారి స్వగృ హం నందు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి చిత్రపటానికి నివాళులర్పించి అనంతరం బొజ్జల గోపా ల కృష్ణారెడ్డి,, బొజ్జల హరినాథ్ రెడ్డి సమాధుల వద్ద బొజ్జల కుటుంబం నివాళులర్పించారు.

వైభవంగా శ్రీ సీతారామకళ్యాణం

విశాలాంధ్ర – చిల్లకూరు: బూదనం గ్రామంలోని శ్రీ కోదండరామస్వామి దేవాల యం సన్నిధిలో మంగళవారం రాత్రి రాములవారికి , సీతమ్మ తల్లికి ఘనంగా , వైభవంగా కళ్యాణమహోత్సవం అర్చకుల ఆధ్వర్యంలో నిర్వహిం చారు. శబ్ది సాయిబాబా మందిర నిర్మాత, ధర్మకర్తలు మరియు నిర్వాహకులు సూరానేని రామచంద్రరావు దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యవంతమైన జీవితం సాధ్యం

విశాలాంధ్ర – గుడిపాల : ప్రతి ఒక్కరు పౌష్టికాహారం పోషకాలు నిండిన ఆహార పదార్థాలు తీసుకోవడం ద్వారానే ఆరోగ్యవంతమైన జీవితం గడపడానికి సాధ్యపడుతుందని వసంతాపురం సర్పంచ్ రజనీకాంత్ అన్నారు మంగళవారం వసంతాపురం సచివాలయం నందు పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ రజనీకాంత్ స్థానిక ఎంపిటిసి విజయలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యంగా పిల్లలు గర్భిణీ స్త్రీలు బాలింతలు పాలు పండ్లు తాజా కూరగాయలు ఆకుకూరలు వంటి పౌష్టిక విలువలు కూడిన ఆహారాన్ని తగినంతగా తీసుకోవాలని తద్వారానే ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనకు వీలు పడుతుందని పిలుపునిచ్చారు అనంతరం పౌష్టికాహారంతో కూడిన పదార్థాలను ప్రదర్శన చేశారు ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ బాల సూర్యనారాయణ వీఆర్వో శ్రీనాథ్ సచివాలయ సిబ్బంది ఆరోగ్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

"సోకియా" యాప్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే బొజ్జల

విశాలాంధ్ర – శ్రీకాళహస్తి : మాజీ మంత్రివర్యులు బొజ్జల గోపాల కృష్ణారెడ్డి 75వ జన్మదిన సందర్భంగా "సోకియా" అనే ఒక సాఫ్ట్‌వేర్ యాప్ ను శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి మంగళవారం ప్రారంభించారు. మాజీ మంత్రివర్యులు, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి తండ్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి 75వ జన్మదిన వేడుకలను శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా "సోకియా" అనే ఒక సాఫ్ట్‌వేర్ యాప్ ను ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి చేతుల మీదగా రాష్ట్ర మైనార్టీ కార్య నిర్వాహక కార్యదర్శి షాకీర్ అలీ, వాళ్ళ అబ్బాయి షేక్ తహర్ అలీ ఆ యాప్ ను ఆవిష్కరించారు.

ధన్వంతరి జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి

బార్బర్ షాపులకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ మంజూరు చేయాలి
నాయి బ్రాహ్మణ కార్పొరేషన్‌కు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలి
బీసీ సంక్షేమ శాఖ మంత్రిని కలిసిన రాష్ట్ర నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం

విశాలాంధ్ర – తిరుపతి : రాష్ట్రంలో నాయి బ్రాహ్మణుల కులదైవమైన ధన్వంతరి జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేలా ఉత్తర్వులు జారీ చేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ను రాష్ట్ర నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం కలసి విన్నవించారు. మంగళవారం అమరా వతిలో మంత్రి సవితను రుద్రకోటి సదాశివం కలసి నాయి బ్రాహ్మణుల అభివృద్ధి సంక్షేమం కోసం నిధులను కేటాయించాలని అభ్యర్థించారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించి పరిష్కరించే దిశగా చొరవ చూపుతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం మీడియాతో రాష్ట్ర నాయి బ్రాహ్మణ కార్పొ రేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా నాయి బ్రాహ్మణులు నిర్వహించుకుంటున్న బార్బర్ షాప్ లకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ జీవోను వెంటనే అమలు చేయాలని, ఆ దిశగా వెంటనే చొరవ చూపాలన్నారు. అలాగే అన్ని జిల్లాల్లో నాయి బ్రాహ్మణులు ఆర్థికంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందే దుకు కావలసిన నిధులు మంజూరు చేయాలని కోరినట్లు చెప్పారు. నాయి బ్రాహ్మణుల కులదైవమైన ధన్వంతరి జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని, గతంలో ప్రభుత్వం జారీచేసిన 13 14 జీవోల ప్రకారం గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలు కార్పొరేషన్ల పరిధిలో ఉన్న కమర్షియల్ కాంప్లెక్స్ గదులను నాయి బ్రాహ్మణులకు కేటాయించాలన్నారు. జీవో నెంబర్ 26 ప్రకారం ప్రభుత్వ ఆసుపత్రులలో బార్బర్ పోస్టులను పోలీస్ శాఖలో బ్యాండ్ పార్టీ విభాగంలో అర్హులైన నాయి బ్రాహ్మణులకే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. 50 సంవత్సరాలు పైబడిన నాయి బ్రాహ్మణులకు నెలకు 5000 రూపాయలు చొప్పున పెన్షన్ ఇవ్వాలని ఇల్లులేని నిరుపేద నాయి బ్రాహ్మణులకు ఇంటి స్థలం కేటాయించాలని మంత్రిని కోరామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత హామీ ఇచ్చినట్లు రుద్రకోటి సదాశివం మీడియాకు వెల్లడించారు. అంతకుముందు మంత్రి సవితను శాలువతో ఘనంగా సత్కరించి శ్రీవారి ప్రసాదాలను అందజేశారు.

గిరిజనులకు ఇష్టుడు గోపాలకృష్ణా రెడ్డి

– మాజీ కౌన్సిలర్ డాక్టర్‌నివేదిత మోరె

విశాలాంధ్ర – శ్రీకాళహస్తి : అద్భుతమైన పరిపాలనా దక్షతతో ప్రజాహిత కార్యక్రమాలు నిర్వహించాలని నిత్యం పరితపించిన స్వర్గీయ బొజ్జల గోపాలకృష్ణా రెడ్డి గిరిజనులకు ఇష్టుడని శ్రీకాళహస్తి పురపాలక సంఘం, 18 వ వార్డు మాజీ కౌన్సిలర్ డాక్టర్ నివేదిత మోరె కొనియాడారు. అజాత శత్రువుగా, శ్రీకాళహస్తి నియోజకవర్గ అభివృద్ధి ప్రదాతగా ఘనకీర్తి పొందిన మాజీ మంత్రి వర్యులు, స్వర్గీయ బొజ్జల గోపాలకృష్ణా రెడ్డి 76 వ జన్మదినాన్ని పురస్కరించుకొని మంగళవారం డాక్టర్ నివేదిత మోరె ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి పట్టణం లోని కొత్త కోనేరు యస్టీ కాలనీలో గల గిరిజనుల మధ్య శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి చేతుల మీదుగా కేక్ చేయించి, స్వీట్లు పంచి పెట్టారు. తన తండ్రి గోపాలకృష్ణా రెడ్డి జన్మదిన వేడుకల కార్యక్రమంలో తమతో పాటు పాల్గొని, కేక్ చేసిన తమ అభిమాన ప్రజా నాయకుడు, ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ, గిరిజనులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి రెడ్డి వారి గురవారెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు దశరధాచారి, గాలి చలపతి నాయుడు, వన్నియకుల క్షత్రియ సంక్షేమ, అభివృద్ధి డైరెక్టర్ మిన్నల్ రవి, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ యం.ఉమేష్ రావు, సాంస్కృతిక విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరు బుజ్జి, పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, నాయీ బ్రాహ్మణ సాధికార సమితి, తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్, మైనారిటీ విభాగం తిరుపతి పార్లమెంటు నాయకుడు సయ్యద్ చాంద్ బాషా, నూర్ మొహమ్మద్, షేక్ రియాజ్, సులేమాన్, భగత్, బిసి విభాగం నాయకులు దాము, భాస్కర్, మణి తదితరులు పాల్గొన్నారు.

పూలే-అంబేద్కర్ ఆశయాలను సాధిస్తాం

విశాలాంధ్ర–చిల్లకూరు: దళిత పీడిత కులాల ఆత్మ గౌరవపోరా టదినాలుగా పూలే, అంబేద్కర్ జయం తులను చూడాలని కులనిర్మూలన పోరాటసమితి నాయ కులు కావలి బాలయ్య పిలుపునిచ్చారు. యేరూరు గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘననివాళి అర్పించారు.

సీతారాముల గ్రామోత్సవం

విశాలాంధ్ర–చిల్లకూరు: శ్రీ సీతారాముల గ్రామో త్సవం మంగళవారం ఉదయం బూదనం గ్రామంలో అర్చకులు మఠం ఓం నమశ్శివాయ ఆధ్వర్యంలో జరిగింది. పూలు, పండ్లు, టెంకాయలు సమర్పించి భక్తులు తమ మొక్కుబడులు సమర్పించారు. ఉత్సాహ పూరిత వాతావరణంలో కార్యక్రమం జరిగింది.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

– శ్రీకాళహస్తి సిడిపిఓ శాంతి దుర్గ

విశాలాంధ్ర – శ్రీకాళహస్తి : పౌష్టిక ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని శ్రీకాళహస్తి సిడిపిఓ శాంతి దుర్గ తెలిపారు. తొట్టంబేడు మండలంలోని రామచంద్రాపురం అంగన్వాడి కేంద్రంలో మంగళవారం పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీడీపీవో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీ నుంచి 22వ తేదీ వరకు అన్నీ అంగన్‌వాడీ కేంద్రాలలో పోషణ పక్వాడ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అలాగే గర్భవతిగా నిర్ధారణ అయినప్పటి నుంచి బిడ్డపుట్టి రెండు సంవత్సరాలు నిండే వరకు వెయ్యి రోజుల పాటు పిల్లలకు మంచి పౌష్టికాహారం అందించాలన్నారు. పిల్లల సంరక్షణ పట్ల గర్భిణులు బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి తెలిపారు. పిల్లలు, కౌమారదశలో ఉన్న బాలికలు, గర్భిణులు, పాలిచ్చే తల్లుల పోషకాహార లోపాలను తగ్గించడానికి వారి ఆరోగ్యాలను మెరుగుపరచడానికి ప్రతి ఒక్కరూ శ్రద్ధ చూపాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న పిల్లలందరి కుటుంబ సభ్యులకు పిల్లల ఆహార అలవాట్లు, వండే పద్ధతులు, తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలు తీసుకోవడం వలన కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం పోషక విలువలతో కూడిన పదార్థాలను సద్వినియోగపర్చు కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ఉష, అంగన్వాడీ కార్యకర్తలు సురేఖ, మునిలక్ష్మి, భారతి, మణెమ్మ, కౌసల్య అంగన్వాడి సహాయకురాలు జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోండి

– చిత్తూరు ఎంపీ, ఎమ్మెల్యే పిలుపు

విశాలాంధ్ర - చిత్తూరు : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్, సీడప్ డి.ఆర్.డి.ఎ సంయుక్తంగా ఈనెల 19వ తేదిన శనివారం స్థానిక ప్రభుత్వ పి.వి.కె.ఎన్. గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో నందు నిర్వహించే జాబ్ మేళాలని ఉద్యోగ అర్హత కలిగిన యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాద రావు చిత్తూరు శాసనసభ్యులు గురజాల జగన్మోహన్ లు పిలుపునిచ్చారు. ఈ జాబ్ మేళాలకు సంబందించిన గోడ ప్రతులను మంగళవారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 19 న శనివారం స్థానిక ప్రభుత్వ పి.వి.కె.ఎన్. గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో నందు నిర్వహించే జాబ్ మేళాలని ఉద్యోగ అర్హత కలిగిన యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ అవకాశాన్ని జిల్లాలోని అన్ని పంచాయితీ వార్డ్ సచివాలయాలోని పరిధిలో ఉన్న ఉద్యోగార్థులను గుర్తించి వారికీ సమాచారం చేరవేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ జాబ్ మేళాకు దాదాపు 20 కంపెనీలు 1000 ఖాళీలతో విచ్చేయుచున్నాయని,కనీస విద్యార్హత 10వ తరగతి నుండి డిగ్రీ ఫెయిల్/పాస్ అయిన 18 సంనుండి 35 సంమధ్య వయస్సు కలిగిన స్త్రీ పురుష అభ్యర్థులు హాజరు కావచ్చునని తెలిపారు.ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యం. గుణశేఖర్ రెడ్డిగారు,పీవీ కెన్ కళాశాల ప్రిన్సిపాల్ జీవన్ జ్యోతి జిల్లా ప్లేసేమెంట్ అధికారి చైతన్య కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ జాబ్ మేళా కు సంబంధించిన వివరాల కొరకు 9985442270, 8520048041 ఫోన్ నెంబర్ల ద్వారా సంప్రదించాలని సూచించారు.

తిరుపతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్

స్పోక్స్ మోడల్ తాత్కాలిక భవనం కోసం ప్రజా ప్రతినిధులతో పరిశీలన : కలెక్టర్

విశాలాంధ్ర – తిరుపతి కలెక్టరేట్ : తిరుపతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌కు అనుసంధానంగా ఏర్పాటు కానున్న స్పోక్స్ మోడల్ తాత్కాలిక భవనం కోసం గుర్తింపు పనులు వేగవంత చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ కు అనుసంధానంగా రాష్ట్రం లో ఐదు స్పోక్ మోడల్ తాత్కాలిక భవనాలు ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో మన తిరుపతిలో ఏర్పాటు చేయనున్న స్పోక్ భవనం కోసం నేడు ఐఐటి, ఏపీఐఐసీ పలు భవనాలను ఐటి ఈసిఓఎస్టి గవర్నమెంట్ ఆఫ్ ఇండియా దీప్తి, ఐఐటి ఏర్పేడు డైరెక్టర్ సత్యనారాయణ, అమరాజా ఆదోని కంపెనీ ప్రతినిధులు, శ్రీకాళహస్తి ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ విజయ్ భరత్ రెడ్డి సంబంధిత అధికారులతో పరిశీలించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిఓ ఎంఎస్ నెంబర్ 03 మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు మన రాష్ట్రంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశారని ఇందులో భాగంగా రాష్ట్రంలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ కు అనుసంధానంగా 5 ఎస్పిఓసి (సింగల్ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్) హబ్‌ల ఏర్పాటు చేయనున్నారని, విశాఖపట్నం ,రాజమండ్రి, ఎన్టీఆర్ జిల్లా, తిరుపతి జిల్లా, అనంతపూర్ జిల్లా ప్రత్యేక హబ్ స్పోక్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించిందనీ అందులో భాగంగా. తిరుపతి లో ఏర్పాటు కానున్న ఎస్పిఓసి (సింగిల్ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్) హబ్ ఏర్పాటుతో కొత్త టెక్నాలజీ ఆవిష్కరణలకు ముందుకు వచ్చే విద్యార్థులకు అన్ని విధాలా సపోర్ట్ అందించి నూతన ఆవిష్కరణలకు దోహద పడేలా ఈ కార్యక్రమం ఉపయోగకరంగా ఉంటుందని, ఆదానీ, అమర్ రాజ, నవయుగ పరిశ్రమల సహకారంతో ఐఐటి తిరుపతి సరికొత్త టెక్నాలజీ ఆవిష్కరణల ఇన్నోవేషన్ ల కొరకు సరి కొత్త ఐడియా లతో ఆవిష్కరణలకు వచ్చే విద్యార్థులకు సాఫ్ట్వేర్, హార్డ్ వేర్ అన్ని విధాల సపోర్ట్ అందించి దక్షిణ ఆంధ్ర కవర్ చేసేలా ఐఐటీ, తిరుపతి స్పోక్ హబ్ గా నెల్లూరు, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి ఉండనున్నదని, అందులో భాగంగానే ఈరోజు తిరుపతి జిల్లాలో ఏర్పాటు చేయనున్న స్పోక్స్ మోడల్ కోసం తాత్కాలిక భవనం కోసం పరిశీలించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఆర్కిటెక్చర్ మణి సందీప్, సిఓఓ ఆదాని కృష్ణపట్నం పోర్టు లిమిటెడ్ రాజన్ బాబు, నవయుగ సీఈవో సుబ్బారావు, పిడిలు డిఆర్డిఏ, మెప్మా శోభన్ బాబు, రవీంద్ర, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి సుధాకర్ రావు, ఏర్పేడు తహసిల్దార్ భార్గవి, డిప్యూటీ తాసిల్దార్ మాధురి, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జోరెపల్లి రామచంద్రయ్య

విశాలాంధ్ర -చిత్తూరు: మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామచంద్రయ్య డిమాండ్ చేశారు.చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ కమిటీ సమావేశం ఎం. వాసు అధ్యక్షతన మంగళవారం జరిగింది.సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జోరేపల్లి రామచంద్రయ్య, ఏఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు యస్. నాగరాజు మాట్లాడుతూ చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పారిశుద్ధ్యం విభాగంలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో అధికారుల నిర్లక్ష్య తగదన్నారు .కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నగరపాలక సంస్థ కమిషనర్, ఆరోగ్యశాఖ అధికారి, సిబ్బందితో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా పరిష్కరించకపోవడం శోచనీయం మన్నారు. ప్రతి సంవత్సరం పారిశుద్ధ్య కార్మికులకు ఇవ్వాల్సిన యూనిఫారం, చెప్పులు, సోపు, నూనె, ఆప్రాన్ ఎందుకు ఇవ్వడం లేదని అధికారులను సూటిగా ప్రశ్నించారు కార్మికుల సమస్యల పరిష్కారం లో అధికారులు జాప్యం చేస్తున్నందుకు ఏప్రిల్ 17 తేదీ న చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయం ముందు నిరసన చేపట్టనున్నట్లు నాయకులు తెలిపారు 17న జరిగే నిరసన కార్యక్రమానికి పారిశుద్ధ్య కార్మికులందరూ పాల్గొనా లని పిలుపుని చ్చారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ గౌరవ సలహాదారు కే.మణి, నగర కార్య దర్శి దాసరి చంద్ర,వర్కింగ్ ప్రెసిడెంట్ కే.రమాదేవి,ఆటో డ్రైవర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఏం. విజయ్ కుమార్ తో పాటు చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు వాసు, జయశంకర్, వినాయక, వినోద్, ఈశ్వర్, మునిరత్నం,గోవిందస్వామి,రమణి,బుల్లెమ్మ,అమ్ములు,వినాయకమ్మ పాల్గొన్నారు.

గంగమ్మ జాతరను ఘనంగా నిర్వహిద్దాం: కమిషనర్

విశాలాంధ్ర – తిరుపతి: తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతరను అద్భుతంగా నిర్వహించేందుకు అందరూ కలసికట్టుగా పని చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం తాతయ్యగుంట గంగమ్మ గుడిలో జాతరకు చేయాల్సిన ఏర్పాట్లపై డిప్యూటీ మేయర్ ఆర్.సి.మునికృష్ణ, అన్ని విభాగాల అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. గతంలో ఏర్పాట్లు, ప్రస్తుతం చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తాతయ్యగుంట గంగమ్మ జాతర వైశిష్ట్యానికి తగ్గట్టుగా అన్ని ఏర్పాట్లు ఏర్పాట్లు చేసేందుకు అధికారులు, సిబ్బంది ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. నగరపాలక సంస్థ తరపున చేయాల్సిన అన్ని ఏర్పాట్లను పరిశీలించాలని అన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా త్రాగునీరు సరఫరా చేయాలని, వాహనాలు పార్కింగ్, క్యూ లైన్ల ఏర్పాటు, భక్తులు పొంగళ్ళు పెట్టుకునేందుకు చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులు అన్ని ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. అలాగే భక్తులకు ఇబ్బంది లేకుండా ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేయాలని అన్నారు. ముఖ్యంగా పారిశుద్ధ్య నిర్వహణలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలని అన్నారు. కమిషనర్ వెంట తాతయ్య గుంట గంగమ్మ గుడి ఈఓ జయకుమార్, మునిసిపల్ ఇంజినీర్ తులసి కుమార్ , డి.ఈ రాజు, ఏసిపి బాలాజీ, రెవెన్యూ ఆఫీసర్లు సేతుమాధవ్, రవి, సర్వేయర్ కోటేశ్వర రావు,శానిటరీ సూపర్ వైజర్ సుమతి తదితరులు ఉన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే

కఠిన చర్యలు

– నగరి డిఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్

విశాలాంధ్ర-వెదురుకుప్పం: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలు వుంటాయని నగరి డీఎస్పీ సయ్యద్ అహ్మద్ అజీజ్ హెచ్చరించారు. మంగళవారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ప్రధానంగా వెదురుకుప్పం లో సంక్రాంతి పండుగ సందర్భంగా సాంప్రదాయం పేరుతో నిర్వహించే జల్లికట్టు సంవత్సరం మొత్తం తరచుగా నిర్వహించడం సరైంది కాదన్నారు.మూగజీవాల ను పందేలు పేరుతో హింసించడం కూడా నేరం అన్నారు.అలాగే మహాభారతం ఉత్సవాలు ప్రారంభం అవుతున్న క్రమంలో ఆయా ఆలయాల ధర్మకర్తలను పిలిపించి పలు సూచనలు చేశారు. ఈ ఉత్సవాల లో భాగంగా రాత్రి పూట నాటకాలలో రికార్డ్ డాన్సులు వంటివి నిర్వహించకూడదని అన్నారు.అలా చేయడం వల్ల యువకులు ఉద్దేశపూర్వకంగా గొడవలు చేసుకొనే అవకాశాలు ఉన్నాయన్నారు. జూదం కోడి పందేలు వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠినచర్యలు ఉంటాయన్నారు.ఏ సమస్య వున్నా పోలీసుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కారం పొందాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్సై వెంకటసుబ్బయ్య,పోలీస్ సిబ్బంది,ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

జాతరో... జాతర

వైభవంగా ముత్యాలమ్మ జాతర

విశాలాంధ్ర – శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా వెలసిన ముత్యాలమ్మ ఆలయంలో మంగళ వారం నుంచి జాతర ప్రారంభమైంది. మూడు రోజుల పాటు ఈ జాతర జరుగుతుంది. మొదటి రోజు మంగళవారం గెరికి ఉత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. మొదట ముత్యాలమ్మ ఆలయంలో ఉన్న వినాయకస్వామి ఆలయం వద్ద విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ముత్యాలమ్మ అమ్మవారికి పలు రకాల అభిషేకాలు నిర్వహించి పుష్పాలతో సుందరంగా అలంకరించారు. అనంతరం ధూప, దీప నైవేద్యాలను సమర్పించారు. జాతరలో మొదటి రోజు ఉదయం మైలు, ముగ్గు, రాత్రి శేషపాన్పు ముగ్గు వేశారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయి ద్యాలు, డప్పుల నడుమ సారెనున ఊరేగింపుగా తీసుకువచ్చి ముత్యాలమ్మకు సమర్పించారు. అనంతరం ఆలయ అర్చకులు పోతురాజు, గెరికలకు పూజలు నిర్వహించి ఊరేగింపు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దేవాదాయ శాఖ భూములను ఆక్రమిస్తే చర్యలు : ఈవో

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు పట్టణంలోని కోనేటి మిట్టలో ఉన్న శ్రీ కోదండ రామాంజనేయ స్వామి దేవస్థానం చెందిన స్థలంలో కొంత మంది రేకుల షెడ్డు వేసి ఆక్రమించుకున్నారు. ఈవో నవీన్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేసి సిబ్బందితో ఆక్రమణల రేకుల షెడ్డును తొలగించారు .గూడూరు శ్రీ కోదండ రామాంజనేయ స్వామి దేవస్థానంకు ఐసిఎస్ రోడ్ లో 75 అంకణాలు స్థలం ఉన్నది ఈ స్థలం విభాగంలో ఉంది కోర్టులో కేసు నడుస్తుంది .ఈ స్థలములో కొంత మంది రాత్రికి రాత్రి రేకుల షెడ్డు వేశారు. మంగళవారం ఈవో నవీన్ కుమార్ స్థలం వద్దకు చేరుకొని సిబ్బందితో షెడ్డును తొలగించారు. ఈ సందర్భంగా ఈవో నవీన్ కుమార్ మాట్లాడుతూ దేవాలయ భూమి కోర్టులో కేసు నడుస్తుందని కొంతమంది ఆక్రమణకు ప్రయత్నించగా దాన్ని తొలగించామని తెలిపారు .